# పెద్దమనిషి

టి. పి. ఒ. అంటే టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్. అంతకంటే తెలుగులో చెప్పలేము.

అయితే ఆవూరి టి. పి. ఒ ను కాస్త వర్ణిస్తే కళ్ళకట్టి పోతాడు. భూతంలా మరివదలడు.

జిరాఫీలా పొడుగాటిమెడ. వాల్‌రస్ మీసాలు, నడిస్తే నిప్పుకోడి; నవ్వితే గుర్రం.

మురుగుకాలవల్లో దుర్వాసనలు గాలివాటున లేస్తున్నాయి.

నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దంలోనుంచి 'హరహరమహాదేవ' నిమ్మళంగా, స్ఫుటంగా వినిపిస్తూంది. నిప్పుకోడిలా అడుగులు, చేతిలో జిగజిగ మెరుస్తున్న పూలసజ్జ, పట్టుసంచికొసలరెపరెపలు.

టి. పి. ఒ. రోజూ ఊరు తెల్లవారకుండా స్నానంచేసి, పట్టుపంచె కట్టుకుని, పూజాసామగ్రితో శివాలయానికి వచ్చి పూజచేస్తాడు. ఆయన దైవభక్తి ప్రసిద్ధి కెక్కింది. కాని దేవుడుకూడా ఒకొక్కప్పుడు అన్యాయంగానే వ్యవహరిస్తాడు. కాకుంటే అతని భార్యకు క్షయరోగం ఎందుకు రావాలి? మధ్య ఆవిడకెందుకు రావాలీ అని! పాపం మందులకూ, మాకులకూ చెడ్డఖర్చయిపోతోంది. కాని మనసుకు శాంతిలేదే!

తుమ్మెదరెక్కల్లా తేలికగా వస్తున్న 'హరహరమహాదేవ'లోనుంచి పిడుగుపాటులా 'అమ్మో'అన్న పొలికేక ఆకాశంలోకి దూసుకుపోయింది. దిక్కులదిరిపోయాయి. మడుగుకట్టిన నెత్తురులో పొడుగ్గాబోర్లాపడిపోయాడు. టి. పి. ఒ. ఆయనంత పొడుగ్గానూ పక్కనేపడివుంది, లావుపాటి చాపాటి కర్ర. దూరంగా జిగజిగ మెరిసే ఇత్తడిసజ్జ, విరజిమ్మినపూలు మెరుపులా దాటేసేడు దౌర్జన్యం చేసినవాడు.

ఎక్కడికి పారిపోతాడు! అప్పుడేదొరికిపోయేడు. అట్టేదూరం వెళ్ళనేలేదు. టి. పి. ఒ. వెర్రికుక్కలాటి అరుపులకు ఇళ్ళలోవాళ్ళూ, అరుగులమీదవాళ్ళూ కూడా అదిరిపడిలేచారు. గబగబా నాలుగు మూలలా పరిగెత్తారు. సీతన్నను పట్టేశారు.

పాపం సీతన్న సుళువుగా దొరికిపోయాడు. మొక్కల్లాంటి నలుగురు కూలీలు పట్టుకున్నారు. చూడటానికి భయంకరంగానే ఉన్నాడు. ఖూనీకోరు లాగే ఉన్నాడు. ఎర్రగా కళ్లు, నిక్కబొడిచిన వెంట్రుకలు. కాని ఉద్రేకంతో ఊగిపోవడంలేదు. వెలిసిన గాలివానలా ఉన్నాడు.

ఎదురుగానే వుంది పోలీస్ స్టేషను. పోలీసులు హుషారుగా వచ్చి సీతన్నను అమాంతం స్వాధీనం చేసుకున్నారు. అసలు అతనెదిరించలేదు. అయినా ఆ హుషారులో ఒళ్లు తెలియక అతన్ని రెండుతన్ని, లాకప్‌లో పడేశారు.

అదిపచ్చి ఆరని ఎర్రని దౌర్జన్యం! టి. పి. ఒ. నే, భక్తితో శివాలయానికి వెళుతూండగానే, కుక్కను కొట్టినట్టు కొట్టేడు. హత్యా ప్రయత్నం!

అసలు మనిషన్నవాడు పాడైపోయేడు. పతనమైపోయేడు. లేకుంటే- కిళ్లీకొట్టు సీతన్నెంత! ఏకంగా టి. పి. ఒ. నే! ఏక్‌దమ్ హత్యా ప్రయత్నమే! ఇలా అయితే ఈ విచ్చలవిడి కాలంలో పెద్ద మనిషన్న వాడెవడైనా బతకగలడా?

ఇంతకూ సీతన్న అతడిని ఎందుకు చావగొట్టేడు? గడ్డుప్రశ్న. పాపం అతడు జిరాఫీలా పొడుగ్గా, వాల్‌రస్ మీసాలతో ఉష్ట్రపక్షిలా నడుస్తుంటే ఊరికి శోభగా వుండేది. అతను బతకడం కష్టం. బతికినా, ఇదివరకే ఆమాత్రం మనిషిపోలిక. ఇక అదీవుండదు.

మెయిన్ రోడ్డుమీద సీతన్న కిల్లీ దుకాణంవుంది. అది యాభై ఏళ్ళనుంచీ అక్కడేవుంది. సీతన్నతండ్రి ఎర్రయ్య. ఎర్రయ్య కిల్లీ అతని కాలంలో ప్రసిద్ధికెక్కింది. ఎర్రయ్య కిల్లీ వేసుకుంటే నోరంతా ఎర్రగా పండిపోతుంది.

తండ్రి బేరం చూసుకుంటున్నంతసేపూ సీతన్న దుకాణం చుట్టూ తిరుగుతూ కూనిరాగం తీస్తుండేవాడు. నెమ్మదిగా ఉండేవాడుగాని గడుసు గచ్చకాయ. కిల్లీ, సిగరెట్, బీడీ వగైరాల కోసం వచ్చిపొయ్యే వాళ్ళు సరదాకో, తమ పెద్దరికం చూపించడానికో అక్కడ తిరుగుతున్న సీతన్నను ఎగతాళి మాటలనేవారు. సీతన్న మొదట ముఖం చిట్లించేవాడు, తరువాత అల్పిసూది గుచ్చినట్టు జవాబు చెప్పేవాడు. ఎర్రయ్య 'తప్పురాబాబు' అని మందలించేవాడు. అవతల వాళ్ళు మాడినముఖాలతో ఫరవాలేదు 'కుర్రోడు' అనేవాళ్ళు.

సీతన్న తండ్రి స్థానంలో దుకాణం ఎక్కుతూనే చిలకలాంటి పెళ్ళాన్ని ఎత్తుకొచ్చాడు.

'బిళ్ళలియ్యవూ!'

'నీ పేరేమిటి?'

'గంగ'

'ఏటీ దొంగా?

'సీ! పిల్లోడా!'

విరగబడి నవ్వేవాడు సీతన్న. బొగ్గులమ్మే లచ్చన్న కూతురు గంగ. గంగ కళ్ళు గండుచేపలు. మాట్లాడినపుడవి తమాషాగా తిప్పుతుంది. నవ్వితే బుగ్గలు సొత్తలు పడతాయి.

గంగ ప్రతిరోజూ ఎర్రయ్య దుకాణం మీదుగానే బడికి వెళ్ళేది. తండ్రికి బాగా డబ్బుంది. రోజూ అణా బేడా ఇచ్చేవాడు. ఒక్కోరోజు తండ్రి జాగాలో సీతన్న కూర్చునేవాడు. అప్పుడతనికి పదేళ్ళు. గంగ అతడికన్నా రెండేళ్ళు చిన్న. నీటుగా వుండేది.

'బిళ్ళలియ్యి'

'బిళ్ళలా? బడ్డీలోకిరా ఇస్తా'

పిడికెడు బిళ్ళలిచ్చేడు.

'అన్నో డే!'

'ఫరవాలేదు. పారిపో. మానాన్న వస్తున్నాడు.

ఒకనాడు సీతన్న గంగను బడ్డీలోకి పిలిచి ముద్దు పెట్టుకున్నాడు. గంగ 'ఛీ! ఛూ! ఎంగిలి!' అని పారిపోయింది. సీతన్న పెదవులు నాకుకుంటూ గంగవైపే చూస్తూ నిలబడిపోయేడు.

కాలం గిలిగింతలు పెడితే గంగ కిలకిలా నవ్వింది. వెన్నెలలా విరిసింది. గంగలాగే పొంగింది.

తిరిగిపోయిన కండలతో, వెడద రొమ్ములతో పొడుగ్గా, శాండోలా తయారయేడు సీతన్న.

వీళ్ళిద్దరి వ్యవహారం పోలీసు కుక్కలా పసికట్టేడు బొగ్గుల వ్యాపారి లచ్చన్న. కోపంతో కూతురి మీద విరుచుకుపడ్డాడు. 'నువ్వు సావుకారు కూతురివి కదా? సదువుకున్నావు కదా? ఆ కిల్లీకొట్టు రౌడీ ఎదవనా సేసుకుంటావు?' అని ఉరిమేడు. ఒకటి రెండు సార్లు సీతన్న మీద కూడా హూంకరించేడు. కాని మనసులతుక్కుపోతే తుమ్మజిగురువేసి అంటించిన పోస్టు కవరులా మరి విడవు!

సీతన్న గంగ ఒకరోజు గుళ్ళో పెళ్ళి చేసుకున్నారు. గంగ గుళ్ళో నుంచి తిన్నగా మొగుడి ఇంటికి వెళ్ళిపోయింది. షావుకారుకు మహా

కోపం వచ్చింది చెడ్డ దుఃఖం వచ్చింది. రెండూ పోయామ్. అది పెళ్ళైఅని సీతన్న అల్లుడే అని ఒప్పేసుకున్నాడు.

సీతన్న కిల్లీకొట్టు దగ్గర మహారద్దీగా ఉంటుంది. ఎడతెరిపిలేని బేరం. ఇంటికి అది సుమారు మైలుదూరం. మొదట్లో పొద్దుటే చద్దన్నం తిని వచ్చేవాడు సీతన్న. తరువాత పద్ధతి మార్చాడు. ఉదయం ఆరు కాగానే వచ్చి, ఎదురుగావున్న హోటల్‌లో ఇడ్లీ, దోసె, కాఫీ సేవించి దుకాణం తెరుస్తాడు. మధ్యాహ్నం పన్నెండు వేసేక, గంగ స్టీలుకారేజీతో భోజనం తెస్తుంది.

గంగ, స్టీలు కారేజి - రెండూ జిగజిగా మెరుస్తుంటాయి. అసలా స్టీలు కారేజీ అందమయిన ఆమె అవయవాల్లో ఒకటిలా ఇమిడిపోయింది!

గంగమీద చాలామందికి కన్నుంది. ఆఫీసుల్లో పనిచేసే పెద్ద మనుషులు, పోలీసులు, ఇరుగు పొరుగు షాపుల యువకులు ఆమెకోసం తహతహలాడతారు. ఎప్పుడైనా పనిమీద సీతన్న పైకి వెళ్ళితే, దుకాణం మీద గంగ కూర్చుంటుంది. అప్పుడు దుకాణంముందు సంతలా పోగవు తారు రోమియోలు. గంగ బుగ్గలమీదపడే లొత్తలు వాళ్ళకు సుడి గుండాలు. ఆమె నవ్వులు చావుగండాలు.

కాని గంగ ఎవ్వరినీ లక్ష్యపెట్టదు. అందరినీ ఆశ అనే రంగుల రాట్నంలో గిరగిరాతిప్పి ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. రాట్నం ఆగిపోగానే ఎక్కడి వాళ్ళక్కడే!

గంగమీద బాగా కన్నువేసిన వాళ్ళలో ఉష్ట్రపక్షి ఒకడు. ఉష్ట్రపక్షి కీచకుడు, దుశ్శాసనుడు - వాళ్ళ జాతివాడు. అతనికి లంచం ఎగ ఊపిరి; తాగుడు, జారత్వం దిగ ఊపిరి. తన ఇన్స్పెక్టర్, సూపర్ వైజర్లతో ఊరంతా తిరుగుతుంటాడు. పట్టణం అతని మనసంత అందం గానూ, ఆరోగ్యంగానూ ఉంటుంది. రోడ్లమీద మ్యునిసిపలు హద్దులు దురాక్రమణచేసి, అరుగులు, ఆవరణలు, గదులు కట్టి, ఇమ్ములేర్పరచు

కుని, ఎక్కువ అద్దెలు రాబడుతూ, పన్నులు ఎగగొట్టే పెద్దమనుషుల జోలికిపోడు. ఏ ప్లానునైతే రూల్సు చూపించి మొదట తిరగగొడతాడో, దానినే మామూలు ముట్టగానే సమర్థించి, ఆమోదిస్తాడు. కమ్మరి, కంసాలి, పాన్‌షాపుల వంటివి ముఖ్యంగా అతని ఒత్తిడికి గురిఅవుతాయి. ప్రతి రోజూ అతని దాడికి పట్నంలో ఏదోమూల అలజడి జరుగుతూ ఉంటుంది. దెబ్బతినేది కష్టపడి చమటోడ్చేవాళ్లు. కుళ్ళు కాలవలో నుంచి కుళ్లుకంపే వచ్చినట్టు, అతని ఉద్యోగంవల్ల ప్రజలకు బాదేగానిపట్నం అందంగాని ప్రజల సౌకర్యంగాని గురివింద గింజ పాటి ఎక్కువకాలేదు.

యముడిలా అతడు, యమదూతల్లా అతని ఇన్‌స్పెక్టరు, సూపర్‌వైజర్— సీతన్న కిల్లీకొట్టువైపు చాలాసార్లువచ్చేరు. అతని అనుచరులు టేపుపట్టుకుని అటూ ఇటూ కొలుస్తూంటే, వాల్‌రస్ మీసాలు కదుపుతూ మూతి ఆడిస్తూ తనేవో సంజ్ఞలు చేస్తాడు. నాలుగయిదుసార్లు సీతన్న దుకాణం దాటించి ఇంటివాళ్ళ గోడదాకా టేపులాగించేడు, అలాంటప్పుడు సీతన్న అతనికి మర్యాదగా నమస్కారంచేసి, దుకాణందిగి, పక్కగా నిల్చుంటాడు. ఉష్ట్రపక్షి సీతన్నఇచ్చే విదేశీ సిగరెట్ల టిన్నులు "వద్దు, వద్దు" అంటూనే అందుకుంటాడు. అతడా సిగరెట్లు తప్ప మరేవీ కాల్చడు.

'ఓయ్ ! నీ బడ్డీ తీసెయ్యాలోయ్ ! ఇది ఎన్‌క్రోచ్‌మెంటు'

'సంపేకండిసార్ ! యాభైఏళ్ళనుంచీ ఈ దుకాణం ఇక్కడేవుంది. ఇదే నా బతుకుతెరువు'

'ఉంటే ! ఇప్పుడు వీల్లేదు. రూల్స్ ఒప్పుకోవు. ఎంత టైమ్ కావాలి ?'

'మీ దయ'

'దయేమిటి ! సిగరెట్లు టిన్నులిస్తున్నావనా ? అన్యాయమైన పైసా నాకొద్దు. మా సూపర్‌వైజరు ఎప్పటికప్పుడు ఖరీదు ఇచ్చేస్తున్నాడే !

అది పచ్చి అబద్ధం !

'ఆ ఊఁసెందుకుసార్ ? నన్నిలా బ్రతకనివ్వండి'

'వీల్లేదు. ఇది నా విధి' చర చరా నడిచిపోయేడు.

ఇలా నాలుగయిదుసార్లు జరిగింది. సీతన్న అతడికీ, అతని బలగానికీ తరుచు పిండప్రదానం చేస్తూనేవున్నాడు. ఏం లాభం ? లంచ గుణం ఏనుగు తామరలాంటిది. గోకినకొద్దీ దురద. బలగం అందరూ ఒకసారి రారు. అందరూ భాగస్వాములు, పంపిణీ సజావుగా జరిగిపోతుంది.

సూపర్‌వైజరు ఉష్ట్రపక్షికి అంతరంగిక కార్యదర్శి. సిగరెట్లు, సీసాలేకాక, స్త్రీ సదుపాయంకూడా అతనిపూచీయే. ఉష్ట్రపక్షికి మదిర, మదిరాక్షి రోజూకావాలి, భార్యను శానిటోరియంలో చేర్చిన దగ్గిరనుండీ మరీని. కూతురుకి మూడవ గర్భం. అందుచేత పురుడు అత్తవారింట్లోనే పోసుకుంటుంది, కొడుక్కి పూనాలో ఉద్యోగం, భార్య ఇద్దరుపిల్లలతో అతనక్కడ హాయిగా ఉన్నాడు. తన భార్యకు తోడుగా శానిటోరియంలో తలచెడిన అక్కగారుంది. అందుచేత ఇల్లంతా ఖాళీ.

గంగమీద మనసుపోయి, పడుతూన్న బాధ భరించలేక ఉష్ట్రపక్షి ఒక సాయంత్రం సూపర్‌వైజర్‌తో విషయం కదిపాడు.

'ఆ సీతన్న పెళ్ళాం గంగ మహా కానిదోయ్!'

పెళ్ళాం కాదు సార్! ఉంచుకున్నది.'

'నిజం!' పక్షి ఆశ్చర్యపడి మీసాలు ఒకదాని తరువాత ఒకటి ఆడించేడు.

'నిజం సార్. బొగ్గుల లచ్చన్న కూతురు. మంచిది కాదుసార్. దాని తల్లి కూడా ఉంపుడు పెళ్ళామే.'

'కానీ, బాగుంటుందోయ్!' పక్షి కిందకు చూస్తూ, బుగ్గలాడించి కనుబొమలెగరేశాడు. 'దాన్నెలాగైనా...'

'కష్టమే సార్.'

'నిజమే. కాని ఎవ్వరి కష్టము ఉండిపోదు. అసలు నీపేరు లిస్టులో నంబర్ వన్. తెలుసా?'

'సరే సార్.'

ఉష్ట్రపక్షి తన బలగంతో సీతన్న దుకాణం పరిసరాలను మరీ తరచుగా దర్శిస్తున్నాడు. సీతన్న దుకాణం దాటించి, ఇంటివారి గోడ అనుకునేవరకూ సర్రున టేపు లాగిస్తున్నాడు. 'ఓయ్. నీపేరేమిటి? వెంకన్నా? కాదు సీతన్నా, నీ బడ్డీ లాభంలేదోయ్. ఎంత టైముకావాలి?' అంటున్నాడు. తరచు గంగతో మాట్లాడుతున్నాడు. ఆమె చిరునవ్వులు బుగ్గలమీద లొత్తలు లైనులా పని చేస్తున్నాయి. కానీ వ్యవహారం ఒక పట్టాన కసకడంలేదు. భగీరథ ప్రయత్నం చేస్తేగాని గంగ లభించేటట్టు లేదు. హుం అనుకున్నాడు. సరే అనుకున్నాడు. పట్టు పట్టరాదనుకున్నాడు. పడ్తే విడవకూడదనుకున్నాడు.

ఒకనాడు ఉదయం టి. పి. ఓ. సీతన్నకు చివరి గడువిచ్చాడు. 'రెండు వారాల్లో బడ్డీ తీసేయాలోయ్!'

'రచ్చించాలి బాబో! ఎక్కడికి పోతాను?'

'అదేం ప్రశ్న! నీకిదివరకే చెప్పానే! అదిగో అ సందులోకి మార్చి'

'అక్కడ బేరం దొరకదు బాబూ.

ఎందుకు దొరకదు! ఇది మెయిన్ రోడ్డు. అంతా ఎంక్రోచ్ మెంటే' అసలీ ఇంటివాళ్ళు కొత్త పునాదులు తవ్వుతున్నారే ఇదంతా ఎన్క్రోచ్ మెంటే. ఇదేం లాభంలేనిపని. ప్రజలు సహకారం చూపకపోతే ప్రభుత్వం పనులెలా చేస్తుంది? పైపెచ్చు ఇది జరగలేదు, అది జరదలేదని మా మీదే నింద. ఏడిసినట్టుంది?'

'సాయంత్రం ఇంటికాడ దర్శనం చేస్తా బాబూ

'అదే వద్దన్నా. అసలు నాకలాంటివి పడవు. రూలంటే రూలే.'

ఎండ కరకర పొడుస్తూంది. ఎదురుగా హోటల్‌లో జనం కాఫీ ఫలహారాలు సేవించి, ఎండకు జడిసి అక్కడే కూర్చుని నిమ్మళంగా సిగరెట్లు, బీడీలు కాలుస్తున్నారు. టి. పి. ఒ. మాటలు సీతన్నకు సూదుల్లా గుచ్చుకుంటున్నాయి. ఆకలి కడుపులో గంటలా మోగుతుంది.

అప్పుడే వచ్చింది గంగ. ముఖంమీద ప్రతి చెమట చుక్కలో సూర్యుడు. ముక్కుపూస తెల్లరాయిలో మూరెడు సూర్యుడు. గంగ చేతిలో స్టీలు కారేజీమీద కరిగిన వెండిలా సూర్యుడు. ఉష్ట్రపక్షి కళ్ళు జిగేలుమన్నాయి. గంగ 'దండాలు బాబూ' అంది. పక్షి సీతన్నవైపు చూసి, 'సరే. నెలాఖరుదాకా టైమిస్తున్నా' అని బయలుదేరేడు. పక్షితో పాటు పక్షి బలగం కూడా వెళ్ళిపోయింది.

'ఏటీగొడబ?' క్యారేజీ విప్పుతూ అంది గంగ.

'గొడబేటి! దుకాణం తీసెయ్యమంటాడు.'

'ఆయనకేదో ఇస్తున్నాము గదా?'

'సరే. ఇచ్చింది వద్దనడు. తన పట్టువదలడు. మాకానోడు.'

'అలాగే ఉందిలే...'

'ఏటీ కతా? — నీకేసిగాని సూస్తున్నాడా?' నోట్లో ముద్దతో నవ్వుతూ అడిగేడు.

'ఎందుకు సూడడు! ఒగిసిన ఆడదానికేసి యే మొగాడుసూడడు? అది దేవుడిచ్చిన జబ్బు. దానికి సాలే మందు. కాని ఇతగాడు, వచ్చినప్పుడల్లా కొరకొరా సూస్తూనే ఉంటాడు'.

మంచినీళ్ళుతాగి గ్లాసు కిందపెట్టి, తువ్వాలుతో మూతి తుడుచుకుంటూ సీతన్న అన్నాడు: 'ఈయనకి మనములున్నారు. భార్య జబ్బుది. వయసు యాభై దాటింది. కాని, ఆడదన్నా, సీసాఅన్నా తెగ మోజు. ఇక లంచమా? ఈయనొక్కడేమిటి? సెట్టుసుట్టంతా అంతే. బడ్డీ తీసేయ

మంటాడు. ఏటి సెయ్యటమాః అని సూస్తున్నా. రెండేళ్ళై ఈ ఇంటి వాళ్ళతో తగాయిదా. ఇప్పుడీయనతో.'

ఇది ఉప కథ. ఆ ఇంటిముందు సీతన్న కిల్లీకొట్టుకు ఇరుప్రక్కల రోడ్డు వైపు కొంత కాళీ జాగా వుంది. ఆ జాగా అంతా ఒక పెద్ద బట్టల వర్తకులడిగేరు. భారీ ఎత్తున అందంగాకట్టి షాపు పెడదామని. మూడు వందలు అద్దె ఇస్తామన్నారు. పట్టణాలలో అన్ని వ్యాపారాలతోపాటు ఇళ్ళ అద్దెల వ్యాపారం కూడా చాలా లాభసాటిది. కాని యాభై ఏళ్ళ నుంచి ఉంది ఆ కిల్లీ కొట్టు. ఇప్పటికీ పాతకాలం వాళ్ళు దాన్ని ఎర్రయ్య కిల్లీ కొట్టనే అంటారు. హరిమీద గిరిపడ్డా కదలనన్నాడు సీతన్న. ఇంటి వాళ్ళకు బట్టల వ్యాపారస్తులతో వ్రాతకోతలు పరిష్కారమయేయి. కాని సీతన్న ససేమిరా కదల్లేదు.

టి.పి.ఒ. బట్టలషాపు ప్లాను మొదట తిరగొట్టేడు. రూల్సు ఒప్పు కోవన్నాడు. ఇంటి వాళ్లు నిరుత్సాహపడ్డారు. కాని వ్యాపారస్తుడు చలించ లేదు. ఇంటి యజమాని ఉష్ట్రపక్షి ఇంటికి తీసుకువెళ్ళేడు. మూడు పచ్చ నోట్లు పడగానే పక్షి ప్రసన్నుడయేడు. కొత్త ప్లాను ధరఖాస్తు ఎలా వుండాలో తనే చెప్పాడు. సీతన్న కిల్లీకొట్టు వ్యవహారం పరిష్కరించడా నికి కీలకం కూడా తనే చెప్పేడు.

ఆ ఇంటిముందు అందమైన బట్టలషాపు లేచింది. సీతన్న కిల్లీకొట్టు కాస్త పక్కకు జరిగింది. కిల్లీకొట్టు రోడ్డును సరాసరి ఆనుకునేవుంది. బట్టలషాపు రెండుగజాలు లోపలికివుంది. అంతే తేడా ! అదే కీలకం.

సీతన్న కొత్త బల్లలతో బడ్డీ నిర్మించి, కొత్త అద్దాలతో, కొత్త పటాలతో అలంకరించేడు.బట్టలషాపు వాళ్ళతోబాటు తనూ 'గృహప్రవేశం' చేసేడు. అరిటిచెట్లు, మామిడాకుల తోరణాలతో కొట్టు కళకళలాడింది. ఆ ముచ్చట చూసి గంగ మురిసింది. మురిసిన గంగ ముఖం చూసి సీతన్న ముచ్చటపడ్డాడు.

కర కర పొడిచే ఎండపోయి, కారు మేఘాలు కమ్మడానికి ఎంత సేపు పడుతుంది ! తుఫాను రేగటానికి ఎంత వ్యవధికావాలి !

ముసురుపట్టింది. రొజ్జగాలిరేగింది. పగలల్లా గంగ స్వయంగా కొట్టుమీద కూర్చుంది బుంగమూతితో. తొలినాడు సాయంత్రమే పోలీసులు సీతన్నను లాకప్పులో పెట్టేరు. పెద్ద పెద్ద ఉద్యోగులకోసమని సీతన్న అడపాతడపా ఖరీదైన సీసాలు సంపాదిస్తాడు. ఆ పెద్దమనుషుల జాబితాలో ఉష్ట్రపక్షి ఒకడు.

సాయంత్రం సీతన్న పక్షికోసం రెండుసీసాలు తెచ్చేడు. సూపర్‌వైజరువచ్చి వాటిని తీసుకుని, మళ్ళీ అక్కడేదాచి, చిన్నపని ఉంది- తిరిగి వచ్చి తీసుకుంటాననివెళ్లేడు. మరి పది నిముషాల్లో పోలీసులువచ్చి, కొట్టు సోదాచేసి, సీసాలతోపాటు సీతన్ననికూడా తీసుకుపోయేరు. సంగతి తెలిసి గంగ గోలపెడుతూ వచ్చింది. కానీ, పోలీసులు సీతన్నని విడిచిపెట్టలేదు. సీతన్న నేరం ఒప్పుకున్నాడు.

మర్నాడల్లా ఒకటే ముసురు. కొట్టుమీద గంగే కూర్చుంది. సాయంత్రం వేగం చీకటిపడింది. చిటపట చినుకూ పడుతూంది. రోడ్డుమీద బురద, నీటిగుంటలు ఏర్పడ్డాయి. గొడుగు వేసుకుని సూపర్‌వైజరు వచ్చేడు. సిగరెట్టుముట్టించి గంగకేసి ఓరగా చూసేడు.

'గంగమ్మా! సీతన్న లేడా?'

'లేడు.' మూలిగినట్టు చెప్పింది.

'ఊరికెళ్ళాడా?'

'ఏటి బాబూ, తెలీనట్టడుగుతావు?' అని, సంగతంతా చెప్పింది. 'తల్లితోడు నాకు తెలీ'దన్నాడు సూపర్‌వైజరు.

'చూడు గంగమ్మా! మా టి. పి. ఒ గారికి మంచి పలుకుబడిఉంది. నువ్విప్పుడువెళ్ళి ఆయనతో చెప్పుకో. తెల్లవారగానే పోలీసు అధికారులతో చెప్పి సీతన్నని విడిపిస్తారు. అంతా ఒక దగ్గర స్నేహితులే మరి. నీకు తెలీదా!'

గంగకు ఆ సలహా నచ్చలేదు. కాని సూపరువైజరు చాలా బల వంతం చేసేడు. టి. పి. ఒ. దేవుడన్నాడు. రాముడన్నాడు. గంగ చివ రకు వెళ్ళడానికే నిశ్చయించింది. కాళ్లు పట్టుకుంటే రాయైనా కరుగుతుం దనుకుంది. పెద్దమనుషుల దగ్గరకు వెళ్ళుతున్నప్పుడు వట్టిచేతులతో పోగూడదని ఒక అత్తం చక్కెరకేళీ అరటిపళ్ళు తీసుకు వెళ్ళింది - చిట పట చినుకుల్లో, కంటిని మోసగించే క్రీనీడల్లో.

రెండు రోజులు పోయేక సీతన్నమీద మధ్యపాన నిషేధం చట్టం కింద కేసు జరిగింది. నూరు రూపాయల జరిమానాకట్టి అతను బయట పడ్డాడు. సూపర్‌వైజరుద్వారా ఉష్ట్రపక్షి చేసిన మోసం తెలిసింది. కాని అలా ఎందుకు చేసేడో అర్థంకాలేదు.

తను తిరిగి వచ్చిన దగ్గర నుంచీ గంగ అదోలా వుంది. ఏదో దిగులు పడుతూంది. ఎంత అడిగినా చెప్పదు. చాటుమాటుగా కన్నీరు పెట్టుకుంటుంది. దుకాణం అక్కడనుండి యే సందులోకో మార్చివేయ కూడదా అంటుంది. అతనికి అంతా అగమ్యగోచరంగా ఉంది.

వారం రోజులలాగే గడిచేయి: చిరునవ్వులతో, వాలుచూపులతో, ప్రతి రాత్రినీ వసంత యామినిచేసే గంగ, దిగనారి నిరుత్సాహంగా ఉండడంచూస్తే సీతన్నకేమో అనుమానం తగిలింది. ఆమెనెవడో అవమా నించేడని పసిగట్టి అడగడం మొదలుపెట్టేడు. కాని గంగ చెప్పలేదు.

సీతన్నబడ్డీ 'ఎన్‌క్రోచ్‌మెంటు' అని దాన్ని తీసివేయమని, మ్యునిసి పాలిటీవారు ఇంటివారికి నోటీసుపంపేరు. వాళ్లాపని మీరే చెయ్యండన్నారు ఒక మంచిరోజున దగ్గర ఉండి సీతన్న బడ్డీ తీయించేడు సూపర్‌వైజరు. యాభైఏళ్లనుంచీ, తండ్రి హయాం నుంచీ పేరుమోసిన తన దుకాణం ఎత్తి వేయబడినందుకు సీతన్నకు సిగ్గు, దుఃఖం కలిగేయి. అసలే గాయపడి వున్న గంగ మనసు బేజారైంది. పోని స్థానచలనం జరిగితే బతుకుతెరువే

పోతుందా? చచ్చిపోతామా? మరోదగ్గర దుకాణం పెట్టుకుందామని సీతన్న కాస్త ధైర్యపడ్డాడు. కాని గంగ ఒకటే ఏడుపు.

ఆ రాత్రి నిశ్శబ్దంలో సీతన్న గంగను కూడదీసుకుని, గుండెలకు హత్తుకుని, వీపు నిమిరి, తలతట్టుతూ ఓదార్చ ప్రయత్నించేడు; కానీ ఆమె గట్టుతెగిన ప్రవాహంలా హోరున ఏడ్చింది. మరి పట్టలేక వెక్కి వెక్కి ఏడుస్తూ నిజం చెప్పేసింది.

'ఆరాత్తిరి. ముసురుపట్టిన్నాడు. నిన్ను పట్టుకున్న మర్నాడు...'

'ఆఁ! ఏమైంది సెప్పు.'

'సూపర్‌వైజర్ సలహాఇస్తే టీ.పి.ఓ. ఇంటికెళ్ళా. అతన్ని బతిమలాడి, కనికరం కలిగించి, నిన్నిడిపించాలని. ఆడు రాచ్చసుడు. నన్ను బలవంతం చేసేడు. కాళ్ళు పట్టుకున్నా. నీ కూతుర్లాటిదాన్నన్నా. కానీ నామాటే యినలేదు. తాగివున్నాడు. సిరిగిపోయిన సీరతో, సెదిరిపోయిన తలతో, ఒళ్ళంతా రక్కులతో పాణం మానం దక్కించుకు బయటపడ్డా. నీతో సెపితే ఏంబాద పడిపోతావో, ఏంజేసిపోతావో అని సెప్పలేదు. మనసు కాలిపోతుంటే దిగమింగి ఊరుకున్నా.'

సీతన్న తలలో రైళ్ళు ఢీకొన్నాయి. కాళ్ళకింద భూమి పగిలిపోయింది. 'ప్రతీకారం, ప్రతీకారం' అని గావుకేకలు చెవులు చిల్లులు చేసేయి.

ఏడ్చి ఏడ్చి అలసి గంగ నిద్రపోయింది. కానీ సీతన్నకు నిద్రపట్టలేదు. తలలో జెర్రులు పాకేయి. హృదయం నిప్పంటుకున్న కారడవిలా పెనుమంట లెగిసి తగలబడిపోయింది. అంటుకున్న అడవిలో వేలాది పక్షులు సెగలు పొగలుదాటి అంతరిక్షంలోకి ఎగిరిపోయినట్టు అతనిలో శాంతి ఎగిరిపోయింది.

కర్ర పుచ్చుకొని, నిమ్మళంగా బయటకు వచ్చి శివాలయంవేపు నడిచేడు. పొంచివుండి అక్కడికి టీ.పీ.ఓ. రాగానే బలంకొద్దీ అతని తల మీదకొట్టి పరుగెత్తాడు. కానీ వెంటనే దొరికిపోయేడు.

టీ.పీ.ఓ. చచ్చిపోలేదు. సంఘనీతిని పరిరక్షించే ఆ యోధుడు, పెద్ద మనిషి, సంఘాన్ని ఇంకా చాలా సంస్కరించాలి. సంఘద్రోహి సీతన్న మాత్రం నాలుగేళ్ళు జైలు కటకటాల వెనక వుండడం సంఘ శ్రేయస్సుకు ఎంతో అవసరం!